ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

మంగళవారం 28 జనవరి 2025



దినసరి.. కష్టాలు..

- జిల్లా కేంద్రంలో లేబర్ అడ్డాలేక ఇబ్బందులు
- రోడ్లపైనే పనికోసం పడిగాపులు
- భవన నిర్మాణ కార్మికులకు ఇబ్బంది
- జిల్లా కేంద్రంలో ప్రత్యేక స్థలం కేటాయించాలని కార్మికుల డిమాండ్
- జిల్లాలో 80 వేల వరకు కార్మికులు



సిరిసిల్లలో రోడ్డుపై కార్మికులు

మొత్తం జనాభా	5.52 లక్షలు
వ్యవసాయదారులు	66,751
వ్యవసాయ కార్మికులు	46,647
భవన నిర్మాణం, ఇతర పనివారు	83,528

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దినసరి కూలీలకు రోజువారీ పనులు దొరకడమే కష్టంగా మారింది. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు రాజన్నసిరిసిల్ల జిల్లాకు వలసరావడంతో స్థానిక కూలీలు పనుల కోసం పోటీపడే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పొద్దంతా కష్టపడితేనే పూట గడిచే పరిస్థితుల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తెల్లవారడంతోనే రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి వేములవాడ పట్టణానికి కూలీలు తరలివస్తారు. కూలీలకు సంబంధించి ప్రత్యేక స్థలం లేబర్ అడ్డా అనేది లేకపోవడంతో రోడ్డుపైనే నిలబడి కూలీ పని కోసం ఎదురు చూస్తుంటారు. తెల్లవారుజామున వచ్చే కూలీలు ప్రస్తుతం చలితో వణికిపోతున్నారు. ఎండ, వానాకాలాల్లో కూడా ఇబ్బందులు పడుతూ రోడ్లమీదే పడిగాపులు పడుతున్నారు. జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు వ్యక్తం చేశారు.

● ప్రత్యేక స్థలం లేకపోవడంతో..

తెల్లవారుజామునే జిల్లాలోని ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు కూలీలు తరలివస్తారు. సిరిసిల్ల జిల్లాకు సంబంధించిన కూలీలే కాకుండా సిద్దిపేట, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల శివారు గ్రామాల కూలీలు కూడా జిల్లాకు పనికోసం వస్తారు. వీరికి ప్రత్యేక పనిప్రదేశం లేకపోవడంతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల ఎదుట ప్రధాన రహదారిపైనే పని ఉందా అంటూ వచ్చిపోయే వారిని అడుగుతూ పడిగాపులు కాస్తారు. ఉదయం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ప్రధాన రహదారి ఎదుట కూలీలతో జన సందోహంగా కనిపిస్తుంది. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఈ రహదారిపై నిత్యం వాహనాలు పరుగులు తీస్తుంటాయి. కార్మికులు ప్రమాదాలకు కూడా గురవుతూ ఉపాధి వెతుక్కుంటున్నారు. వీరు నిలబడే చోట దుకాణాలు తెరచిన వెంటనే యజమానులు వీరిని అక్కడి నుంచి వెళ్లగొడుతున్నారు. ఎక్కడా నిలబడి కూలీకోసం వెతుక్కోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రానికి రోజు ఎక్కువ సంఖ్యలో కార్మికులువస్తారు. వీరితో పాటు ఆంధ్రా, తెలంగాణలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు కూడా సిరిసిల్లలోనే ఉంటూ రోజువారీ పనులకోసం ఎదురు చూసేవారు ఉన్నారు. ఎక్కువగా భవన నిర్మాణ పనులకే కూలీలు వస్తుంటారు.

మహిళలకు రక్షణ కరువు...

జిల్లా కేంద్రానికి మగ కూలీలతో పాటు మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నారు. వీరు కూడా రోడ్ల మీద ఎదురుచూస్తున్న క్రమంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడుగా రక్షణ కూడా లేకుండా పోతోంది. పనిపేరుతో పిలిచే యజమానులు వారితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలు ఉన్నాయి.

బుధవారం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ కూలీని పనికి కోసం అని తీసుకవెళ్లి లైంగికంగా వేధింపులకు... మిగతా 8లో

శిఖం భూముల కబ్జా, మట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు

- తహసీల్దార్ రామచంద్రం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో శిఖం భూముల ఆక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: మండలంలోని అన్ని గ్రామాల్లో నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నీటి వనరులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. శిఖం భూములను ఎవరైన ఆక్రమించుకుంటే కేసు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించారా..?

తహసీల్దార్: మండలంలోని గ్రామాల్లో సాగుకు యోగ్యంగా లేని 1300 ఎకరాల భూములను గుర్తించాం. వెంచర్లు, పెట్రోల్ బంక్‌లు, పౌల్ట్రీ ఫామ్‌లు బయట పడ్డాయి. అల్మాస్‌పూర్‌లో 40 ఎకరాల చెరువుకు రైతు బంధు డబ్బులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ భూములను రికార్డుల నుంచి తొలగించాం.

ఆంధ్రజ్యోతి: మట్టి, ఇసుక అక్రమ రవాణాపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: మండలంలో అక్రమంగా మట్టి, మానేరు వాగు నుంచి ఇసుక రవాణా తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాం. మట్టి తరలింపునకు వినియోగిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇసుక కూపన్ల జారీలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి..మీరేమంటరు?

తహసీల్దార్: స్థానిక అవసరాల కోసం ఇసుక తరలింపునకు లబ్ధిదారుడు డీడీ చెల్లిస్తేనే కూపన్లను జారీ చేస్తున్నాం. డబ్బులు వసూలు చేస్తున్నామనే ఆరోపణలు వాస్తవం కాదు. రవాణా సమయంలో వాగుల వద్ద కార్యాలయానికి సంబంధించిన వ్యక్తిని నియమించి ప్రతీ వాహనం అనుమతి పత్రాన్ని పరిశీలించేలా చూస్తున్నాం.

- ఎల్లారెడ్డిపేట

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఎరువులు, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు బీమా, పీఎం కిసాన్ తదితర పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు తమ పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను నిత్యం తనిఖీ చేయాలని, ఎరువులు, పురుగుల మందుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. డీఏపీ ఇతర ఎరువుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఎరువులు, మందులు విత్తనాలు సిద్ధంగా ఉండాలని ప్రతీవారం పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఏడీఏ రామారావు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సేవలు అందించడమే లక్ష్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించామన్నారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఫ్రిబవరి 15 నుంచి 27 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్ పోటీలకు ఇంగ్లీష్‌యూనియన్ పాఠశాలకు చెందిన వర్షిత్, ప్రహర్షిత్, గుణభద్రలు ఎంపిక కావడంతో వారిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

సిరిసిల్ల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందించే సేవలు అభినందనీయం అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. సిరిసిల్ల పట్టణం సాయినగర్ శివారు ప్రాంతంలో ఛత్తీస్‌గడ్‌కు చెందిన పేద కార్మికుల గుడిసెలు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతయ్యాయి. ప్రాంతాన్ని గ్రంథాయల చైర్మన్ నాగుల సత్యనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ సభ్యులు సందర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుడ్ల రవి, వైస్‌చైర్మన్ వేణుగోపాల్, సభ్యులు పాల్గొన్నారు.



దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సత్యనారాయణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

బీసీ సాధికారత సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా మహేష్

సిరిసిల్ల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ సాధికారత సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా అంకారపు మహేష్‌ను నియమించారు. సోమవారం బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య నియామకపత్రాన్ని మహేష్‌కు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లా డుతూ తన నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి

- కేజీబీవీలో ఆన్‌లైన్ విద్యావిధానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



కేజీబీవీలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులు అత్యున్నత స్థానంలో నిలవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సోమవారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం ఆన్‌లైన్ విద్యావిధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ఉండాలని ఆన్‌లైన్‌లో జేఈఈ, నీట్ పరీక్షల కోసం శిక్షణ ఇస్తామన్నారు. ఏవైన సందేహాలు ఉంటే జిల్లాస్థాయి అధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యావంతులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ, జీఈసీవో పద్మజ, ఎంఈవో శ్రీనివాసగౌడ్, ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాఠాలు బోధించిన కలెక్టర్, ఎమ్మెల్యే

కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎమ్మెల్యే సత్యనారాయణ పాఠాలు బోధించారు. తొమ్మిదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థులు తత్తరపాటు గురవడంతో కలెక్టర్ బోర్డుపై గణితం, ఎమ్మెల్యే సైన్స్ అంశాలపై వివరించారు. పరీక్షలు త్వరలోనే ఉన్నందున విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, బండలింగంపల్లి గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసే కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ అధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం గుడ్డుకు ఐదు రూపాయలు చెల్లిస్తే మార్కెట్‌లో ఎనిమిది రూపాయ లు ఉందన్నారు. కార్మికులు అదనంగా మూడు రూపాయలు పెట్టి కొనుగోలు చేసి అందిస్తున్నారని తెలిపారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సావిత్రి, మైసమ్మ, సుమలత, రేణుక, వజ్రవ్వ, కనుకరాజమణి, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

ప్రభుత్వ అసైన్డ్ భూములను కబ్జా కాకుండా కలెక్టర్ కాపాడడంతోపాటు గ్రామ అవసరాలకు కేటాయించాలంటూ ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. బండలింగంపల్లి వాసులు సోమవారం ఆటోల్లో సుమారు 200 మంది సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నాచేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 262లో ఉన్న 11 ఎకరాల 38 గుంటలు ఉన్న ప్రభుత్వ భూములను గ్రామంలోని ఎస్సీ కులస్థులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిని కాపాడాలంటూ ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేకుండా పోయిందని తెలిపారు. దశాబ్ద కాలంగా ఖాళీగానే ఉందని ఆ భూములను గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన వారు కబ్జా చేస్తున్నారని దానిని అడ్డుకుని భూములను రైతులకు ఉపయోగపడేలా ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు ఇతర అవసరాలకు వినియోగించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు మల్లయ్య, దేవయ్య, అదిమల్లయ్య, రాకేష్, వెంకటయ్య, పర్శయ్య, చిన్న మల్లయ్య, పర్శరాములు, మహేష్, కుంటయ్య, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో విన్నపాల వెల్లువ

- ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆదేశం

- సిరిసిల్ల కలెక్టరేట్

8



కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- సిరిసిల్ల కలెక్టరేట్

8



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు

● 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం ● 30 లీటర్ల సారా స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, గుంటపల్లిచెరువు తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శైలజ ఆధ్వర్యంలోని అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 30 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి పదిమంది అనుమానితులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట బైండోవర్ చేశామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. బైండోవర్లను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రణీత్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, రాజు, మల్లేశ్, కిషోర్‌కుమార్, కృష్ణకాంత్, యోగివర్మ, సర్ధార్‌అలీ, శంకర్, సుమన్, రాకేశ్, సాయికృష్ణ, లలిత, రూప పాల్గొన్నారు.



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పురుగుల మందు తాగి కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన పర్స రాములు (55) అనే కూలీ పురుగులమందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో రాములు ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. కుటుంబీకులు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఉరివేసుకొని..

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో నాగెపల్లి శంకర్(45) ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా క్షౌరవృత్తిని మానేసి తాగుడుకు బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెరట్లో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

గంగాధర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు వరద కాలువ దగ్గర రోడ్డు పక్కన 30 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తిగా అనుమా దాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళ ముఖంపై రక్తపు మరకలు ఉండగా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు.



మహిళ మృతదేహం

చెరువులో మృతదేహం గుర్తింపు

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామ రెవెన్యూ శివారులోని ఎర్రకుంట చెరువులో 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో సోమవారం లభ్యమైంది. మృతుడి ఒంటిపై కాఫీ రంగు నైట్ ప్యాంట్, ఎరుపు, గోధుమ రంగు డబ్బాలు డిజైన్‌తో ఉన్న షర్టు ధరించి ఉన్నట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు అటు వైపు వెళ్లగా చెరువులో మృతదేహం కనిపించిందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదీ హత్యా...ఆత్మహత్యా..? ఎన్ని రోజుల క్రితం సంఘటనా జరిగింది? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహంను గుర్తు పట్టిన వారు ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి ఫోన్ నెం. 8712656817, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఫోన్ నెం. 8712656826 అనే నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

రాష్ట్ర మహాసభల్లో సీపీఎం నాయకులు



రాష్ట్రసభల్లో పాల్గొన్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు కరీంనగర్ నుంచి జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, కోనేటి నాగమణి, జిల్లాకార్యక్రమాల రిపోర్టును కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి ప్రవేశపెట్టారు.

రేపు వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష

గణేశ్‌నగర్ : వేసవిలో విద్యుత్ సరఫరాపై బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వ హించనున్నారు. నగరంలో కరీంనగర్ సర్కిల్ నోడల్ అధికారి అన్నపూర్ణాదేవి సర్కిల్ ఎస్‌ఈ సమక్షంలో చర్చించనున్నారు.

కూచిపూడిలో 'ఉజ్వల' ప్రదర్శన

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ
- పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రదర్శనలు
- పలువురికి నృత్య శిక్షణ



గుమ్మడి ఉజ్వల

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వల కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. కళల పట్ల ఉన్న ఆసక్తితో కూచిపూడిలో డిప్లమాతో పాటు మాస్టర్స్ చేసి కళాకారులకు శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలిచ్చి అవార్డులు, ప్రశంసలు అందుకుంటోంది.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుమ్మడి పెద్దులు-నిర్మలాదేవి కూతురు ఉజ్వల. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తితో డిగ్రీ చదువుతూనే గురువుమేదరి నర్సయ్య వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందింది. ఆయన ప్రోత్సాహంతో మంథని సంగీత, నృత్య కళాశాలలో డిప్లొమా పూర్తి చేసింది. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో మాస్టర్స్ పూర్తి చేసి అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నది. తాను నేర్చుకున్న కళను పలువురికి నేర్పించాలనే సంకల్పంతో నృత్య శిక్షణ కేంద్రాన్ని 2014లో స్థాపించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దుతోంది.



కూచిపూడి నృత్యప్రదర్శనలో ఉజ్వల



అవార్డు అందుకుంటున్న ఉజ్వల

● ఎన్నో అవార్డులు...ప్రదర్శనలు...

ఉజ్వల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నది. నేటికి కేంద్ర సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీశైలం, బాసర, వేముల వాడ, తదితర దేవాలయాల్లో, మహాశివరాత్రి, దసరా ఉత్సవాల్లో నృత్య హారతి ఇస్తోంది. 2019లో స్వచ్ఛభారత్ రామగుండం కార్పొ రేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉజ్వల ఎన్నికైంది. ఇటీవల హైదరాబాద్‌లో బుక్ ఫెడరేషన్ కార్య క్రమం, ఘంటసాల శతజయంతి ఉత్సవంలో ఉజ్వల ప్రదర్శన ఇచ్చారు. 2014లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తొలిసారి తెలంగాణ నుంచి సుకూన్ ఫెస్టివల్‌లో ఉజ్వల కూచిపూడి నృత్య ప్రదర్శనిచ్చి ఆకట్టుకుంది.

● పాఠశాలల్లో నేర్పించాలి

తెలంగాణ రాష్ట్ర బాష సాంస్కృతిక శాఖ, ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో కళను ఒక విద్యగా అందించాలని, కళల పట్ల అవగాహన కల్పించాలని కళా ఉజ్వల ప్రాజెక్టుతో మరో అడుగు ముందుకు వేసింది. ఈ ప్రాజెక్టుతో కళను నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసంపై చైతన్యం తీసుకురావడంతోపాటు ఉపాధి, అభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందుకోసం ప్రయత్నం చేస్తున్నానని ఉజ్వల తెలిపారు.

నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించండి!

● ప్రజావాణిలో ప్రభుత్వానికి మిడ్ మానేరు నిర్వాసితుడి దరఖాస్తు ● వ్యవస్థపై నమ్మకం పోయిందన్న చల్లా బాలరాజు

సిరిసిల్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల్ని నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఓ సంచలన దరఖాస్తు వచ్చింది. తనకు నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించాలంటూ ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వానికే దరఖాస్తు చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన చల్ల బాలరాజు ఈ వినతిపత్రం సమర్పించారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో తమ కుటుంబం 4.50 గుంటల స్థలం, అందులో 1.50 గుంటల్లో ఉన్న ఇంటిని కోల్పోయిందని తెలిపారు. నిర్వాసితుడిగా ఇంటికి సంబంధించి పరిహారాన్ని రూ.16 లక్షలుగా నిర్ణయించారని, ఇందులో రూ.3.09 లక్షల పన్ను మినహాయించి మిగిలింది ఇచ్చారని పేర్కొన్నారు. కానీ, మిగిలిన 3గుంటల స్థలానికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం కింద ఇంటి స్థలాన్ని తాము కోరుకున్న గ్రామంలో కాకుండా మరో గ్రామంలో ఇచ్చారని తెలిపారు. అందుకు కూడా తాము అంగీకరించినా.. ఆ స్థలాన్ని సైతం వెనక్కి తీసుకుని.. నివాసయోగ్యం కాని బండరాళ్లున్న మరో స్థలం ఇచ్చారని వాపోయారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా.. అధికారులు భూసేకరణ చట్టాలను అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయకుండా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యుడైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలంటూ బాలరాజు గతేడాది జనవరిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడంతో గతేడాది జూన్‌లో హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 24న హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మరోసారి వినతిపత్రం ఇచ్చారు. తనకు చట్టాలపై, న్యాయవ్యవస్థపై నమ్మకం పోయిందని అందులో పేర్కొన్నారు. అలాంటి అధికారులను కొట్టడం, తిట్టడం చట్ట విరుద్ధమైనందున.. నక్సల్స్‌లోకి వెళ్లి ప్రజాకోర్టులు ఏర్పాటు చేసి పేదలకు, సామాన్యులకు, నిరక్షరాస్యులకు న్యాయం చేయాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. అందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి దీనిని పరిశీలించి.. బాలరాజు సమస్యను పరిష్కరించాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కాగా, బాలరాజు మరోసారి ఇదే విజ్ఞప్తితో సోమవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి హాజరై వినతిపత్రం ఇచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో ఐదు నెలల జైలు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చిట్టపురం పోషన్న(58) అనే వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2019 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవే శపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాడిపల్లి గ్రామానికి చెందిన మామిడాల రవీందర్‌రెడ్డి(53) తన పొలంలో కూరగాయల సాగు కోసం నారు తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై మొలంగూర్‌కు వెళ్లి నారుతీసుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సింగాపూర్ గ్రామ శివారులోని పెద్ద గుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్‌రెడ్డి కిందపడిపోయాడు. కిందపడిన రవీందర్‌రెడ్డి శరీరంపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై పరిశీలన జరిపారు. మృతుడు మాందాడిపల్లి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

● ఒకరి పరిస్థితి విషమం

హుజూరాబాద్ మండలంలోని రాంపూర్-జూపాక గ్రామ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాంపూర్ గ్రామానికి చెందిన మాడుగుల శ్రీనివాస్‌తో పాటు జూపాక గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాయ్యాయి. ఈ ప్రమాదంలో మాడుగుల శ్రీనివాస్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇల్లంతకుంట నుంచి ద్విచక్రవాహనంపై కముటం శృతి, ఇట్టిరెడ్డి పద్మ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకనుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శృతి, పద్మ గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడి

ముత్తారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంథని రాజక్క అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన బంధువు మంథని వంశీ మద్యం మత్తులో ఆదివారం రాత్రి దాడి చేశాడు. సమ్మక్క వంశీ ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి మద్యం సేవించగా మాటామాట పెరిగి సమ్మక్కపై వంశీ కర్రతో దాడి చేశాడు. గొడవను ఆపేందుకు మంథని రాజక్క అడ్డు రాగా రాజక్కకు గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

జమ్మికుంట సీఐపై విచారణ

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవికుమార్ ఓ అట్రాసిటీ కేసు విషయంలో మధ్యవర్తి వద్ద ముడుపులు తీసుకున్నారని ఎదుర్కొంటున్న ఆరోపణలపై హుజూరా బాద్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. అట్రాసిటీ కేసు విషయంలో రూ. 3లక్షల నగదును మధ్య వర్తి షేక్ సాబీర్ అలీ ద్వారా బాత్‌రూం బకెట్లో పెట్టించి సీఐ తీసుకు న్నాడని, వారి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడి యో రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. విచారణకు హాజరు కావాలంటూ షేక్ సాబీర్ అలీకి రెండ్రోజుల క్రితం పోలీసులు నోటీసులు అందజేయగా, హుజూరాబాద్ ఏసీపీ కార్యాల యంలో పోలీసు అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సీఐ తన వద్ద తీసుకున్న డబ్బులకు సంబంధించిన ఆధారాలు, ఇతర వివరా లు అన్ని విచారణ అధికారులకు అందజేసినట్లు విచారణ అనంతరం షేక్ సాబీర్ అలీ వెల్లడించారు. అట్రాసిటీ కేసు ఫిర్యాదుదారులు, కేసు కాకుండా మధ్యవర్తికి ద్వారా ముడుపులు అప్పగించిన వారిని కూడా పోలీసులు త్వరలో విచారించనున్నట్లు తెలుస్తుంది. సదరు మధ్యవర్తి విచారణకు హాజరయ్యే ముందు తనపై పోలీసులు కేసు పెట్టి రిమాండ్ చేసే అవకాశం ఉందని వీడియో విడుదల చేశాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్లకోట సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం సోమవారం తెలిపారు. గ్రామంలోని కోట ప్రాం తంలో కొందరు వ్యక్తులు ఎక్స్‌కావేటర్ యంత్రంతో మట్టిని తీస్తూ రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వాహనాలను స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రామచంద్రం హెచ్చరించారు.

శ్రీరాముడి విగ్రహం ధ్వంసం

● మానేరు వంతెనపై బీజేపీ, హిందూ సంఘాల రాస్తారోకో

తంగళ్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దేవాలయంలో నెలకొల్పిన శ్రీరాముడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో తంగళ్లపల్లి మండలంలో రాస్తారోకో, ఆందోళనలతో ఉద్రిక్తత నెలకొంది. తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో గత శ్రీరామనవమి రోజు పూజలు నిర్వహించి సీతా, రామలక్ష్మణుల విగ్రహాలను తాత్కలికంగా నెలకొల్పారు. సోమవారం ఉదయం శ్రీరాముని విగ్రహం తల ధ్వంసమై ఉండడాన్ని స్థానికులు గమనించారు. గుడికి తాళం లేకపోవడం, ఎవరో ఉద్దేశపూర్వకంగానే శ్రీరాముని విగ్రహాన్ని ధ్వంసం చేశారని భావించారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావుతో పాటు బీజేపీ నాయకులు కేసీఆర్‌నగర్‌లోని ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు. విగ్రహం ధ్వసం చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ రామ్మోహన్ తన సిబ్బందితో చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయం మండలం మొత్తం వ్యాపించడంతో హిందూ సంఘాలు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు మానేరు వంతెనపై రాస్తారోకోకు దిగారు. సుమారు అరగంట పాటు రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సీఐ మొగిలయ్య, ఎస్‌ఐ రామ్మోహన్ చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు



సారంగాపూర్ సహకార సంఘం వద్ద రైతులు

యూరియా కోసం బారులు

సారంగాపూర్, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఒక్కో రైతుకు ఆధార్‌కార్డుపై ఐదు బస్తాలను అందించారు. చాలా మంది రైతులకు యూరియా అందక పోవడంతో గంటల కొద్ది లైన్‌లో నిలబడి వెనుదిరిగారు. యూరియా కొరతపై సహకార సంఘం సీఈవో శివను వివరణ కోరగా సోమవారం రైతులు ఒక్కసారిగా రావడంతో కొరత ఏర్పడిందన్నారు. మంగళవారం మరో లారీ లోడ్ యూరియా వస్తుందని రైతుతు వచ్చి తీసుకెళ్లాలని వివరణ ఇచ్చారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ఎలిగేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొలాలకు ఎస్సారెస్పీ సాగునీరు అందడం లేదని సోమవారం ఎలిగేడు, లాలపల్లి ఆయకట్టు ప్రాంత రైతులు డి-86ప్రధాన కాలువ వద్ద ఆందోళన చేశారు. 13-ఎల్ ఉపకాలువ ద్వారా 55 ఎకరాల పైచిలుకు పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. నాట్లు వేసుకొని రోజులు గడుస్తున్నా తక్కువ నీరు రావడంతో సుమారు 25మంది రైతులు డి-86 ప్రధాన కాలువ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ డీఈ ఎండి.షిరాజ్, ఏఈలు అయాబ్, జెలని సమస్యను పరిష్కరిస్తామన్నారు. 13ఎల్ కాలువ తూములో గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లు వేయడంతో నీటి సరఫరా తక్కువైందని రైతులకు వివరించారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో తూముల్లో అడ్డుగా ఉన్నబండరాళ్లను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈడీఈ షిరాజ్ మాట్లాడుతూ కాలువల్లో అడ్డుగా బండలు వేసినా, తూములను ధ్వంసం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ముత్కల మల్లేశం, వెంగల్‌దాసు తిరుపతి, ముంజంపల్లి చిన్నసాయిలు, బావు రవీందర్, సప్పుల రవి ఉన్నారు.



సాగునీటికోసం డి86కాలువ వద్ద రైతులు

మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై కేసు

-ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని కోర్టులో పిటిషన్

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడనే ఫిర్యాదుపై కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై శనివారం కేసు నమోదైంది. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన పుల్లా రాజగౌడ్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని కోర్టులో పిటిషన్ వేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 25న కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు గంగాధర రమేష్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక తలుపు తొలగించి దొంగలు లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.3.46లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. రమేష్ కుటుంబ సభ్యులు ఆదివారం గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌కు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి చోరీ విషయం వెలుగులోకి వచ్చింది.

ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, మృతికి కారణమైన భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ అనే వ్యక్తి రమ్య అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్నప్పటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశాడు. భరించలేక వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. తన మేనకోడలు మృతికి భర్త కారణమంటూ మృతురాలి మేనమామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాయి కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?


గుట్టపై వెలిసిన నర్సింహస్వామి

పూర్తయిన ఫార్మేషన్ రోడ్డు

- 13 ఏళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- పూర్తి కాక నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్ష మెప్పుడు కలుగుతుందోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా మాఘ మాసంలో పౌర్ణమికి ముందు నాలుగు రోజుల పాటు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. 1967 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పుడు స్వామి వారి ఆదాయం 1800 రూపాయలు ఉండగా ప్రస్తుతం 60లక్షల రూపాయలకు చేరుకుంది.


నల్లగొండలో నర్సింహస్వామి గుట్ట

ఎత్తైన గుట్టపై స్వామి వారు వెలియడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా వెళ్లి మొ క్కులు చెల్లించుకుంటారు. గుట్టపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవ టానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవ డంతో ఆలయ ఫౌండరీ ఛైర్మన్ చెన్నాడి సత్యనారాయ ణరావు 1991-1993 సంవత్సరంలో గుట్ట కింద నర్సింహ స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామి వారిని ప్రతిష్ఠించారు. వివిధ రకాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విజయం చేకూర్చమని నర్సింహస్వామికి ముడుపులు కడతారు. పదవులు వచ్చాక ఘాట్ రోడ్డు నిర్మాణం మరిచి పోతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.


ఘాట్ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

● 2012లో పనులకు శంకుస్థాపన

2012లో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ఎంపీ 10లక్షల రూపాయలు, దేవాలయ నిధులు 30లక్షల రూపాయలతో ఫార్మేషన్ రోడ్డు చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగినట్లయితే భక్తుల రద్దీ పెరగటంతో పాటు ఆలయానికి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాలకు మధ్యలో కొడిమ్యాల మండలంలోని నల్లగొండ నర్సింహస్వామి ఆలయం ఉంది. గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, సైడ్ డ్రైనేజీ, సీసీ నిర్మాణం, రోడ్డుపై అవసరం ఉన్న చోట కల్వర్టుల నిర్మాణం, పైపుల ఏర్పాటు, కింది నుండి గుట్టపై వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులకు డార్మెటరీ హాల్, తాగు నీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత శాఖ అధికారులు నిధులు మంజూరు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ కళాశాల విద్యార్థి


జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన సాయిచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గడప సాయిచరణ్ అనే విద్యార్థి కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో భాగంగా అగ్రహారం డిగ్రీ కళాశాల నంచి సాయిచరణ్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు జరగబోయే జాతీయ సమైక్యతా శిబిరంలో సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాల్లో సాయిచరణ్ పాల్గొంటాడని తెలిపారు. సాయిచరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శారద, శకుంతల అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పెద్దపులి ఆనవాళ్లు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుకార్లను నమ్మవద్దని, పులి సంచారంపై ఎలాంటి సమాచారం ఉన్నా తెలుపాలని ప్రజలను కోరారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై ఐదు రోజుల క్రితం పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందగా అటవీ అధికారులు మండలంలోని బొల్లోనిచెరువు. కొండాపూర్, నల్లగొండ శివారులను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో పెద్దపులి ఆనవాళ్ల కోసం తిరుగుతున్నారు. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, నూకలమర్రి శివారులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులను, వ్యవసాయ కూలీలను, పశువుల కాపరులను పెద్దపులి ఆనవాళ్లపై వివరాలు తెలుసుకున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో డీఆర్వో ముషీర్ అహ్మద్, బీట్ అధికారులు అశ్విని, ఆనందరావు, వసీం, ప్రవీణ్, మహేందర్, వాచర్లు ఐదు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతాన్ని నాలుగు బృందాలుగా విడిపోయి పరిశీలిస్తున్నారు. అడవిలో సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో కొడిమ్యాల అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి పోయినట్లుగా అటవీ అధికారులు భావిస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు

- ప్రారంభించనున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి


క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కరీంనగర్ క్రీడా కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలోని 12 క్రీడావేదికలపై 29 క్రీడ అంశాలలో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లోని క్రీడా మైదానంలో డీజీపీ ఇంటెలిజెన్సీ తెలంగాణ శివధర్ రెడ్డి ప్రారంభించనున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని సీటీసీ, హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్, సీపీటీసీ, కరీంనగర్ క్లబ్, జీఎస్ అకాడమీ, అలుగునూర్ రేడ్ తదితర ప్రాంతాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలు..

- సీపీకి ఫిర్యాదు చేసిన మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై గత 3 రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ వి రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ 43వ డివిజన్ అధ్యక్షుడు నవాజ్ హుస్సేన్‌లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర మేయర్ వై సునీల్‌రావు సోమవారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఫోటోలతో అసభ్యకరంగా, పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా పేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేసి విచారణ జరిపించాలి

సుభాష్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ధరణి 13బి ద్వారా అక్రమ పట్టాలను రద్దు చేసి, దానిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్, కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలకు చెందిన తమ భూములను గత 30 సంవత్సరాలుగా తామె సాగుచేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా ఒక వ్యక్తి అప్పటి జమ్మికుంట తహసీల్దార్ కన్నం నారాయణ ద్వారా ఎలాంటి విచారణ చేయకుండా తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేరుపై 13బి పట్టాలు పొందారని ఆరోపించారు. ఆయన తరువాత వచ్చిన తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్ళామని ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంతకాలు ఫోర్జరీ చేసి చర్చికి అంబేడ్కర్ భవనంకు స్థలం ఇచ్చినట్లుగా చూపుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంపత్, శ్రీనివాస్, కొండయ్య పాల్గొన్నారు.

వేములవాడ క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- స్వామి వారి దర్శనానికి నాలుగంటల సమయం


భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి బారులు తీరారు. ఆది దేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు కోడెమొక్కు క్యూలైన్‌లో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని మొక్కులు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు అభిషేక పూజలో పాల్గొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఘనంగా మహా లింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సోమవారంను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉదయం స్వామి వారికి మమన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు చేపట్టారు. సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో లింగార్చనంలో దీపాలను వెలిగించి మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో పలుకుబడికి పెద్దపీట

- ఎక్స్ వేదికగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తుడు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా పలుకుబడి ఉన్న ఓ పెద్ద మనిషికి ప్రాముఖ్యత ఇవ్వడం విమర్శలకు దారితీసింది. రాజన్న ఆలయంలో ప్రతి సోమవారం ఉదయం నిర్వహించే నిత్యపూజలు, అలంకరణ పూర్తి కాకముందే స్వామి వారితో పాటుగా అమ్మవారిని దర్శించుకుంటున్న తీరు ప్రస్తుతం వేములవాడలో చర్చనీయాంశంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం నాలుగు గంటలకు స్థానికులకు ఉచిత దర్శనం అవకాశం ఉంది. స్థానికేతరుడైన అతను తన కుటుంబీలకుతో కలిసి స్వామివారి గర్భగుడిలో గంటల తరబడి పూజలు చేస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తికి పూజారులు దగ్గరుండి మరీ పూజలు నిర్వహిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి.

సోమవారం ఉదయం రాజన్న ఆలయ గర్భగుడిలో అతను పూజలు నిర్వహిస్తుండగా స్థానిక భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఓ భక్తుడు రాజన్న ఆలయ ఈవోకు వాట్సప్‌లో, జిల్లా కలెక్టర్, సీఎంవోకు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆలయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రూ.7, 150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 29మంది రైతులు 324 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 21క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యూజీసీ గైడ్ లైన్స్ వెనక్కి తీసుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ గైడ్ లైన్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ గైడ్‌లైన్స్ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే వీసీలుగా నియమించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

గేట్ పడితే పడిగాపులు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



చేగుర్తికి వెళ్లే దారిలో రైలు గేటు పడటంతో నిరీక్షిస్తున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ నుంచి చేగుర్తికి వెళ్లే దారిలో రైల్వే గేటు పడిన ప్రతిసారి వాహనదారులు, గ్రామస్థులు పడిగాపులుకాస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు పడే గేటు తరచూ పడుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ మీదుగా రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతోపాటు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతున్నారు. మరోవైపు బొగ్గు, ఎరువులు, గ్రానైట్ గూడ్స్ రైళ్ల ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటాయి. దీంతో రోజుకు 10 నుంచి 12 సార్లు గేటు పడుతోంది. నాయకులు, అధికారులు స్పందించి ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ మార్గదర్శకాలు తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియని, యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కోల్పేయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించిన యూజీసీ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతోందన్నారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ జిట్ట బాలకృష్ణ తెలిపారన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించేలా మార్గదర్శకాలు ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాసే చర్యగా కనిపిస్తోందని వెల్లడించారు.

చివరి ఆయకట్టుకు చేరని మిడ్‌మానేరు నీరు

- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు


పెర్కపల్లి వద్ద నిలిచిన కాలువ నీరు


వెన్కేపల్లి శివారులో ఎండిపోతున్న మొక్కజొన్న చేనును చూపిస్తున్న రైతు

సైదాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్, సైదాపూర్, జాగీర్‌పల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి గ్రామాలకు కాలువ ద్వారా మిడ్ మానేరు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పంటలు ఎండుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలంలో పంటలు సుభిక్షంగా పండాలని ముందుగానే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మానేరు కాలువకు నిధులు విడుదల చేసినప్పటికీ చివరి వరకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పెర్కపల్లి గ్రామం వరకు నీరు వచ్చి ఆగుతుందని, అక్కడి నుంచి మిగతా ప్రాంతాలకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు కిందికి నీటిని వదులడం లేదని రైతులు పేర్కొంటున్నారు. నీరు చివరి ఆయకట్టు వరకు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు మా గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

మొక్కజొన్న ఎండుతోంది



- ఏనుగుల మహేందర్, రైతు, వెన్కేపల్లి

సైదాపూర్ శివారులో నేను నాలుగెకరాల మొక్కజొన్న సాగు చేశాను. కానీ నీరు లేకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ ద్వారా నీరు విడుదల చేయాలి.

నీరులేక పంటలు ఎండుతున్నాయి



- మెడవేన రాజు, రైతు, గుజ్జులపల్లి

నేను గుజ్జులపల్లి శివారులో మూడెకరాల వరకు పల్లి చేను వేశాను. నీరు లేకపోవడంతో పూర్తిగా ఎండుతుంది. అధికారులు మిడ్ మానేరు నీరు కాలువ ద్వారా విడుదల చేసి పంటలను కాపాడాలి.

అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా



- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాలకు మిడ్ మానేరు నీరు రావడం లేదని నా దృష్టికి వచ్చింది. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో సోమవారం జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతు గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించలేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు బట్టి హరికృష్ణ, ఫున్ని పవన్, అభిషేక్, నన, రుచిత, అక్షయ్, ఉదైశ్రీ, త్రిష, మహేశ్వరి, దివ్య, వర్షిణి, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల నిర్మాణానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి రవాణా సౌకర్యం మెరుగు పరుస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం మాట్లాడుతూ పల్లెల ప్రగతికి సర్కారు కృషి చేస్తోందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, కిషన్, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, మహేందర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల వితరణ

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని బీరప్ప, సౌడాలమ్మ ఆలయాల వరకు వీధిదీపాలను మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ వితరణ చేశారు. ఆలయాలకు విద్యుత్ సరఫరా లేదని ఎమ్మెల్యే సత్యనారాయణ దృష్టికి తేగా సెస్ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గొల్ల కురమ సంఘ నాయకులు ఎమ్మెల్యే, మాజీ సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా నరేష్‌కుమార్

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడిగా పసుల నరేష్‌కుమార్ ఎన్నికయ్యాడు. మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా బట్టు అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శనిగరం అనీల్‌కుమార్, కోశాధికారిగా చిట్యాల సంజీత్, ప్రచార కార్యదర్శులుగా దర్శనం నరేష్, శీలం రాజు, సంయుక్త కార్యదర్శులుగా సావనపెల్లి జాన్‌సుందర్, శనిగరం మధు ఎన్నికయ్యారు. సాంస్కృతిక కార్యదర్శిగా గొడిశెల రజనీకాంత్, పసుల శ్రీకాంత్, ముఖ్యసలహాదారులుగా గన్నేరం నర్సయ్య, రామంచ లచ్చయ్య, పసుల బాలరాజు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజావాణిలో విన్నపాల వెల్లువ

- ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 27: (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని పలువురు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సోమవారం వినతి పత్రాలు అందించారు. సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలివరావడంతో జిల్లా కలెక్టరేట్ హాల్ ప్రజలతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 152 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. .

● వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత



వృద్ధురాలికి వీల్‌చైర్‌ను అందించిన అధికారులు

నడవలేక ఇబ్బంది పడుతూ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన సిరిసిల్ల పట్టణానికి చెందిన మేర్గు విజయ అనే వృద్ధురాలు కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. స్పందించిన లక్ష్మీరాజం వెంటనే వృద్ధురాలికి వీల్‌చైర్‌ను అందించారు.

● కుటుంబ ప్యాకేజీ నష్టపరిహారం అందించాలి

మిడ్‌మానేరు జలశాయంలో ముంపునకు గురైన చీర్లవంచ గ్రామానికి చెందిన నిర్వాసితులకు ఇళ్లస్థలాల తోపాటు కుటుంబ ప్యాకేజీ డబ్బులు చెల్లించాలంటూ పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. చీర్లవంచ గ్రామానికి చెందిన చల్ల ఉపేందర్, ఇర్నాల సారయ్య, ఇర్నాల తిరుపతి, ఇర్నాల రాజవ్వ, చల్ల నర్సయ్య, చల్ల రవి, ఇసుకొండ లింగయ్య, ఇనుకొండ తిరుపతి, ఇనుకొండ నరహరి, ఇనుకొండ లక్ష్మణ్, ఇనుకొండ నర్సింహాలు తమకు నష్టపరిహారం తోపాటు ఇళ్ల స్థలాలను ఇప్పించాలని కోరారు.

● 'డబుల్' ఇళ్లకు పట్టాలు అందించాలి



రామన్నపల్లె గ్రామస్థులు

తంగళ్లపల్లి మండలం రామన్నపల్లె గ్రామంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలకు పట్టాలను అందించి హద్దులను చూపించాలని గ్రామస్థులు కలెక్టర్‌కు వినత పత్రం అందించారు. రామన్నపల్లె గ్రామంలో ఇళ్లులేని నిరుపేదల కుటుంబాలకు 2021 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించి 20 కుటంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి అందించారన్నారు. కానీ పట్టాలను అందించకపోవడంతో పాటు హద్దులను చూపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

● కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై విచారణ జరిపించాలి

సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నూతనంగా నిర్మిం చిన కమ్యూనిటీ భవన నిర్మాణంలో నాణ్యత లోపించిందని వెంటనే వాటిపై విచారణ జరిపించాలని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెంకటేశం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఆట స్థలాన్ని కేటాయించాలి

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో ఆటలు ఆడుకునేందుకు స్థలాన్ని కేటాయించడంతో పాటు కోతుల బెడదలనుంచి గ్రామాన్ని రక్షించాలంటూ యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. స్పందించిన పెద్దూర్ శివారులోని మైసమ్మ శిఖంలో భూములను ఆట స్థలం కోసం కేటాయించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

● గోదాంను నిర్మించాలి

బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంతో పాటు గోదాంలను నిర్మించాలని భారతీర కిసాన్ సంఘ్, సీతారామ రైతు సేవాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు భారతీయ కిసాన్ సంఘ్‌కు చెందిన పలువురు గ్రామస్తులుసోమవారం తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

● భూములకు నష్టపరిహారం ఇప్పించండి

తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో మాల కులస్థులకు కేటాయించి తీసుకున్న భూములకు నష్టపరిహారంతోపాటు జీవనోపాధి కోసం స్థలాలను కేటాయించాలని గ్రామస్థులు కోరారు. మాల కుటుంబాలకు రెండెకరాల చొప్పున 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కేటాయిందన్నారు. 2004లో అప్పటి ప్రభుత్వం భూములను సాగు చేసుకోవడం లేదంటూ తిరిగి తీసుకుందని అ భూములకు ఇప్పటి వరకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని కలెక్టర్‌కు విన్నవించారు.

● ఉపాధి కల్పించండి

- గొట్టే యశ్వంత్, వెంకటాపూర్



ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. నేను 10వ తరగతి వరకుచదువు కున్నాను. నా తల్లి క్యాన్సర్‌తో మృతి చెందింది. నాకు ఉపాధి లేకపోవడంతో తండ్రి నర్సయ్యను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాను. నాకు ప్రభుత్వ ఉద్యోగం అందించి ఆదుకోవాలి.

● ఇందిరమ్మ ఇళ్ల వివరాలను ప్రకటించాలి

- దొబ్బల రాము, సుద్దాల, కోనరావుపేట



కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని సర్వేనంబర్‌లో 247, 284లో 1984, 1985 సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలను కేటాయించారు. అందులో ఇందిరమ్మ ఇళ్లకోసం కేటాయించిన లబ్ధిదారుల వివరాలను అందించడంతోపాటు స్థలాలను చూపించాలి.

● ఆశావర్కర్‌గా నియమించాలి

- బోధన్ లక్ష్మి, పెద్దలింగాపూర్, ఇల్లంతకుంట



నర్సుగా 10 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉంది. గ్రామంలో నా కుటుంబం పరిస్థితి పూర్తిగా బాగాలేదు. గ్రామంలో ఆశావర్కర్ పోస్టు ఖాళీగా ఉంది. నన్ను నియమించి కుటుంబాన్ని ఆదుకోవాలి.

దినసరి.. కష్టాలు

(5వ పేజీ తరువాయి)

ఒడిగట్టిన సంఘటన మహిళా కూలీల్లో ఆందోళనను నింపింది. కూలీలు ఎక్కడికి వెళ్తున్నారో వివరాలు కూడా నమోదు చేసే పరిస్థితి లేకపోవడంతో మహిళలుకూడా పనులకు వెళ్లడానికి భయపడుతున్న సందర్భాలు ఉన్నాయి.

● ప్రత్యేక స్థలాలు కేటాయించాలి

జిల్లాలో రోజువారీ కూలీ పనులకు వచ్చే కార్మికులకు ప్రత్యేక లేబర్ అడ్డాలకు స్థలాలు కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్థలాలు కేటాయించడంతో పాటు కూర్చోవడానికి షెల్టర్లు, అత్యవసర పరిస్థితుల్లో తిరిగి రాత్రి వేళల్లో ఊళ్లలోకి వెళ్లలేని వారికి విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని మహిళలకు రక్షణ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

కూలీల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి..

- అన్నల్‌దాస్ గణేష్ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి



సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, కూలీలు పనికోసం వస్తుంటారు. అంబేద్కర్-గాంధీ రోడ్డులో నిల్చోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనికి పిలిచే వరకు గంటల తరబడి నిలబడి ఎదురు చూస్తుంటారు. వీరికి అనువైన స్థలాన్ని కేటాయించి కూర్చోవడానికి వీలుగా షెడ్లను ఏర్పాటు చేయాలి.

కార్మికులకు రక్షణ కల్పించాలి...

- బాలవ్వ, భవన నిర్మాణ కార్మికురాలు



భవన నిర్మాణ కార్మికులు పనులకు వెళ్లే క్రమంలో వారికి తగు విధమైన రక్షణ చర్యలు ఉండే విధంగా చూడాలి. ప్రధానంగా మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. మహిళలు ఎవరి వద్దకు పనికి వెళ్తున్నారో వారి వివరాలు కూడా సేకరించే విధానం రావాలి. కార్మికులకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి మౌలిక వసతులు, కార్మికుల రికార్డులు ఏర్పాటు చేయాలి.

లేబర్ అడ్డా ఏర్పాటు చేయాలి..

- దర్ర మల్లయ్య, కార్మికుడు



వేములవాడలో రోడ్డుపైనే నిలబడి రోజు వారీ కూలీ కోసం అనేక మంది కార్మికులం ఎదురు చూస్తాం. ఎలాంటి సౌకర్యాలు లేక ఎండ,వానలో ఇబ్బందులు పడుతున్నాం. ప్రత్యేకంగా లేబర్ అడ్డా కోసం స్థలం కేటాయించి ఏర్పాటు చేయాలి.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జనరల్, వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేది నుంచి 22వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఫస్టియర్ విద్యార్థులు 5065 సెకండ్ ఇయర్ విద్యార్థులు 4245 మొత్తం 9310 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెంటర్లలో మాస్ కాపీయింగ్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి ధైర్యం చెప్పాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనంతరం సమాధాన పత్రాలను సరిగా సీల్‌చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డీఈవో జగన్ మోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, ఆర్‌టీసీ సెస్, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో డోర్స్ ఫౌండర్ అండ్ చైర్మన్ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అసోసియేషన్ బాధ్యులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల(డోర్స్) అధ్యక్షుడు జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి శేషాద్రి, ట్రెజరర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసాచారి, వైస్ ప్రెసిడెంట్స్ జడ్పీ సీఈవో వినోద్, ఎస్డీసీ రాధాభాయ్, డీసీఓ రామకృష్ణ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, ఓటీపీ లింకుల ద్వారా జరుగుతున్న మోసాలు, 1930 ప్రాధాన్యంపై వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అభిషేక్ ఉన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవంలో భాగంగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు ముగిసాయి. సోమవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో విజేతలకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ సీనియర్ సిటీజన్స్‌కు గణతంత్ర దినోత్సవంను పుర్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీలు శారీరంకంగా మానసికంగా ఉల్లాసాన్ని ఇచ్చాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కలిసికట్టుగా ఉంటే అసోసియేషన్ అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. న్యాయ విభాగానికి ఉచితంగా సమయం ఇచ్చి సేవా దృక్పథంతో పనిచేసే వారు అసోసియేషన్ కోసం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కోశాధికారి దొంత దేవదాసు, నాయకులు ముత్తయ్యగౌడ్, జ్ఞానోబా రామచంద్రం, తమటం రామానజమ్మ, అంజనాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పొత్తూరు, కందికట్కూర్, కిష్టరావుపల్లె, వల్లంపట్ల, అనంతారం, ఇల్లంతకుంట, ముస్కానిపేట, వెంకట్రావుపల్లె, అనంతగిరి, దాచారం గ్రామాల్లో సోమవారం రూ కోటి 86 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తునే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేయడం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుందని వివరించారు. అనంతరం కందికట్కూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రైలు థీమింగ్ వేయగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్, ఆకుల సత్యం, కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమర్, తిరుపతి, కిషోర్, మ్యాకల శ్రీనివాస్, రమేష్, చల్ల నారాయణ, మాధవరెడ్డి, రాజేశం, బడుగు లింగం, మంద పెద్దబాల్‌రెడ్డి, తూముకుంట రాజేందర్‌రెడ్డి, నరేష్, జ్యోతి, సత్యారెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముస్తాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి ఎన్ఆర్ఐ మిత్ర మండలి సభ్యులు ఆర్థిక సాయాన్ని అందించారు. దుబాయ్‌లో గుండెపోటుతో మరణించిన గూడెం దేవేందర్ కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ మిత్ర మండలి అండగా నిలిచారు. ఎన్ఆర్ఐ మిత్ర మండలి సభ్యులు పర్శ తిరుపతి, వందన శ్రీకాంత్, జనగామ శ్రీనివాస్, నరేశ్‌రావు తదితరులు రూ 3 వేలను అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మెంగని రాజు, గూడెపు దేవేందర్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

వేములవాడ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రాళ్లపేట గ్రామానికి చెందిన 53 సంవత్సరాల మహిళ ఫిల్లోడ్స్ టూమర్ అనే వ్యాధితో బాధపడుతూ ఆదివారం ఆసుపత్రిలో చేరింది. దీంతో సోమవారం ఏరియా ఆసుపత్రి వైద్య బృందం ఫిల్లోడ్స్ టూమర్ అనే రొమ్ములో గడ్డని అరుదుగా ఇచ్చే మత్తు ద్వారా తొలగించారు. మామూలుగా నరం ద్వారా శరీరం మొత్తం మత్తు వచ్చేలా చేసి గడ్డని తొలగిస్తారు. అలా కాకుండా మత్తు వైద్య బృందం డాక్టర్ తిరుపతి, రవీందర్, రాజశ్రీ, ప్రియాంక, సిద్ధార్థలు కలిసి రీజనల్ తొరసిక్ ఎపిడ్యూరల్ అనే పద్ధతి ద్వారా మత్తు మందుని పంపి రోగికి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఇలా చేయడంతో ఆపరేషన్ సమయంలో, ఆసుపత్రిలో రోగి చికిత్స తీసుకున్నన్ని రోజులు ఎలాంటి నొప్పి తెలియకుండా ఉటుందని పేర్కొన్నారు. డాక్టర్ పెంచలయ్య నేతృత్వంలో డాక్టర్లు రాజేంద్ర, జెస్సీ, రత్నకుమారి ఇతర సహాయక బృందం పాల్గొన్నట్లు తెలిపారు.

జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌లో జమైన మొత్తాన్ని గణన చేయాలి



వినతిపత్రం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ కోసం 2024 డిసెంబరు వరకు జమైన మొత్తాన్ని గణన చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు సోమవారం జడ్పీ ఉపముఖ్యకార్యనిర్వాహణ అధికారి ఎం గీతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల జడ్పీ జీపీఎఫ్ ఖాతాల్లో నుంచి జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ పొందేందుకు జడ్పీ కార్యాలయం అధికా రులు 2021-22 వరకు ఉన్న స్లిప్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారన్నారు. అలాకాకుండా 2024 డిసెంబరు వరకు ఖాతాల్లో జమైన మొత్తం నుంచి పార్ట్ ఫైనల్ విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీవో నంబర్ 317 ఫలితంగా జిల్లాలు మారని ఉద్యోగుల ఖాతాలు మరియు ఖాతాలలో జమ అయిన మొత్తాన్ని వడ్డీతో సహా ప్రస్తుతం వారు విధులు నిర్వహిస్తున్న జిల్లాలకు బదిలీ చేయాలని విన్నవించారు. తమ వినతిపై జడ్పి ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి అంబటి రమేష్, కార్యదర్శి ఎలగొండ రవి పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



లింగంపేటలో ఎడ్లబండిలో తరలిస్తున్న కలప

చందుర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా టేకు చెట్లను నరికి కలపను ఎడ్లబండ్లలో తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కలప స్మగ్లర్లు ఎడ్లబండ్లలో కింది భాగంలో విలువైన టేకు దుంగలను పెట్టి పై భాగంలో చిన్నచిన్న కర్రలను ఉంచి టేకు కలపను తరలిస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో టేకు కలపతో ఫర్నీచర్ తయారు చేయించి వేములవాడ, సిరిసిల్ల పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. లింగంపేట ప్రాంతంలో ఎంతో విలువైన అటవీ సంపద ఉంది. ఏళ్ల తరబడి ఇక్కడ వృక్ష సంపద అక్రమార్కుల చేతుల్లో పడి తరలిపోతోంది. కొన్ని నెలలుగా అడవి నుంచి విలువైన వృక్షాలను తరలిస్తుంటే అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే 'పల్లా'పై దాడి అమానుషం

సిరిసిల్ల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అమానుషం అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వ ర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామ న్నారు. జనగామ నియోజకవర్గం ఎర్రగుంట తండాలో నిర్వహించిన ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను అమలు చేయాలని కోరిన పల్లా రాజేశ్వ ర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నందుకు పోలీసులతో లాఠీచార్జి చేయించడం, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం శోచనీయం అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసేంత వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తునే ఉంటామన్నారు. సమావేశంలో నాయకులు ముష్కం అనిల్‌గౌడ్, సంపత్, నిఖిల్, అక్రమ్, అసిన్, నరేష్ పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఇల్లంతకుంటలో క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. మంద కృష్ణమాదిగ తన జీవితమే పోరాటంగా ముందుకు సాగారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఉద్యమించి సాధించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శరవింద్, నర్సయ్య, శంకర్, కనక రాజు, సామ్యాల్, శ్రీనివాస్, తిరుపతి, దేవయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు మంద రాజు, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్, అంబేద్కర్ సంఘ మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, నాయకులు కాసుపాక సురేష్, పట్నం మహేందర్, దేవదాసు, శంకర్, లింగం, కాసుపాక సురేష్, రాములుచ సింహాద్రి పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో జరిగిన సంబరాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం, నాయకులు రాజేష్, చంద్రయ్య, రాజం, రాజయ్య, కృష్ణ, డేవిడ్, రాజరాం, అశోక్ ఎల్లయ్య, దేవరాజు ఉన్నారు.

తంగళ్లపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యాక్ర మంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపల్లి బాలయ్య, నాయకులు దుర్గయ్య, నర్సయ్య, దేవయ్య, వెంకటేశ్వర్లు, నరేష్, గుండు ప్రేమ్‌కుమార్, కిషన్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బడుగు పెద్దలింగయ్య, లింగంపల్లి శ్రీనివాస్, బడుగు నాగరాజు, కత్తెర పెద్దరాజయ్య, బడుగు చిన్నలింగయ్య, కత్తెర లచ్చయ్య, లింగంపల్లి అశోక్ పాల్గొన్నారు.

గంభీరావుపేట(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరుకుటం తిరుపతి, గొల్లపల్లి తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు జగన్, నరేష్, సందీప్, స్వామి, గణేష్, సాహరా, ప్రవీణ్, రాము తదితరులు ఉన్నారు.

రుద్రంగి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో మండల ఉపాధ్యక్షుడు తర్రె లింగం, తర్రె మనోహర్, దయ్యాల పెద్దులు, దయ్యాల రమేష్, తర్రె సుదర్శన్,దయ్యాల రాజయ్య, పల్లి గంగధర్, గొళ్కెం నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.